

## టిటిడి బోర్డు సభ్యులుగా మరో ఇద్దరు ప్రమాణం

నేడు ఎనిమిది మంది



**ప్రజాశక్తి -తిరుమల**

టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులుగా మిలింద్ కేశవ్ నర్వేకర్, సౌరభ్ బోరా మంగళవారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సన్నిధిలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు.స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం శ్రీవారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటాన్ని జేఈవో అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి పాల్గొన్నారు. టీటీడీ డెప్యూటీ ఈవోలు లోకనాథం, గోవిందరాజన్, పేష్కార్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఎనిమిది మంది ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

# గువ్వలకాలనీ ఇళ్లు కూల్చొద్దు

### చెన్నయ్- తిరుపతి రైల్వేట్రాక్ మ్యాప్ మార్చాలి

**ప్రజాశక్తి - రేణిగుంట**

మండలంలోని గువ్వలకాలనీ ఇళ్లు కూల్చరాదని, అందుకు అనుగుణంగా చెన్నయ్ - తిరుపతి రైల్వే ట్రాక్ లైన్ మ్యాప్ మార్పు చేయాలని వామపక్షాలు, గిరిజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తూకివాకం పంచాయతీ పరిధిలోని గువ్వలకాలనీ మీదుగా రైల్వే డిపార్టుమెంట్ కొత్తగా రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయనుంది. సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు హరినాథ్, మోహన్‌రెడ్డి మాట్లాడుతూ గువ్వలకాలనీలో 1993 నుంచి 80 మంది కుటుంబాలు ఉంటున్నాయన్నారు. వీరికి ఐఎవై స్కీం కింద అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టించి ఇచ్చిందన్నారు. రైల్వేస్టేషన్ ఆధారంగా నక్కల కులస్తులు రైల్లో ప్రయాణించి



యాత్రికులకు పూసలు, బొమ్మలు, వివిధ రకాల ఫ్యాన్సీ వస్తువులను అమ్ముకుని జీవిస్తున్నారన్నారు. ఇప్పటికీ ఒక్కో ఇంట్లోనే పేదరికం కారణంగా రెండు మూడు కుటుంబాలు పెళ్లయినా సర్దుకుపోతున్నారన్నారు. దాదాపు 200 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. అయితే రైల్వే ట్రాక్ మూడు లైన్లు మార్గం కొత్తగా నిర్మిస్తున్న కారణంగా గువ్వలకాలనీ గిరిజనులు, గాంధీనగర్ కాలనీ మైనార్టీ, ఇతర పేదల ఇళ్లు ఖాళీ చేయాలని రైల్వే డిపార్టుమెంట్ గిరిజనులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే దండోరా వేసి, బెదిరించి ఒత్తిడి చేయడం దుర్మార్గమన్నారు. నక్కలకాలనీ నాయకుడు అలాబాబాను తహశీల్దార్ ఆఫీసు పిలిపించి కులం పేరుతో దుర్భాషలాడుతూ దౌర్జన్యం చేశారన్నారు. ఈ ధర్నాలో ఎరుకుల ప్రజాసంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవరకొండ శంకర్‌రావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్, నాయకులు వెంకటరమణ, కుప్పస్వామి, నరసింహారెడ్డి, మోహన్‌రెడ్డి, రజాక్, గోవింద్, భానుచందర్, హరి, సెల్వరసూల్ పాల్గొన్నారు.

# మహిళలకు పింక్ టాయిలెట్స్ : కమిషనర్

**పజాశక్తి - తిరుపతి టౌన్**

మహిళల కోసం ప్రత్యేకంగా ఆధునిక వసతులతో పింక్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి ఆర్టీసి బస్టాండ్ ప్రాంగణంలో ఎమ్.ఎస్.సుబ్బలక్ష్మి సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పింక్ టాయిలెట్స్ పనులను కమిషనర్ హరిత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా మహిళలు, చంటి బిడ్డ తల్లులకు, ముఖ్యంగా చంటి బిడ్డలను దష్టిలో వుంచుకొని ఏర్పాటు చేస్తున్న పింక్ టాయిలెట్స్ ఉపయోగకరంగా వుండేలా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. తిరుపతి నగరానికి నిత్యం వస్తున్న వారిని దష్టిలో వుంచుకొని, మొదటగా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్మిస్తున్నామని, మరిన్ని రద్దీ ప్రాంతాలను గుర్తించి అక్కడా పింక్ టాయిలెట్స్ ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తామన్నారు. చిన్న పిల్లలకు పాలు పట్టించేందుకు సరైన వసతుల లేమిని గుర్తించడంతో పింక్ టాయిలెట్స్ ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఇండియన్, యూరోపియన్ టాయిలెట్స్ వుంటాయని, బాత్ రూములు, వాష్ రూము, చిన్న బిడ్డలకు పాలు పట్టించేందుకు సోఫాను అమర్చినామని, డైపర్లు మార్చేందుకు మరో ప్రత్యేక రూమును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అతి త్వరలో అన్ని పనులను పూర్తి చేసి పింక్ టాయిలెట్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. కమిషనర్ వెంట డిఈ విజయకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**స్మార్ట్ సిటీ పనులు గడువులోపు పూర్తవ్వాలి**



స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో జరుగుతున్న అభివద్ధి పనులు గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఎం.డి., నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ కింద నగరంలో జరుగుతున్న అభివద్ధి పనుల పురోగతిపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో స్మార్ట్ సిటీ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, ఏఈకామ్, ప్రాజెక్టుల కాంట్రాక్టర్లతో స్మార్ట్ సిటీ ఎం.డి. మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏ ఏ ప్రాజెక్టుల పనులు ఈ మేరకు జరిగాయి, ఇంకా ఎంత బ్యాలన్స్ ఉన్నాయి, ఎందుకు ఆలస్యం అవుతున్నాయనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శ్రీనివాస సేతు, వినాయక సాగర్ పనులు త్వరలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు.

# సిపిఎం సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాశక్తి - తిరుపతి టౌన్**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆగస్టు 30వ తేదీ బుధవారం నుండి సెప్టెంబర్ 4వ తేదీ వరకు సిపిఎం ఆధ్వర్యంలో చేపడుతున్న సమరభేరి కార్యక్రమం పోస్టర్ను మంగళవారం యశోద నగర్ లోని సిపిఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి సుబ్రమణ్యం మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ధరలు తగ్గిస్తామని చెప్పిన హామీని విస్మరించడం ప్రజల్ని మోసం చేయడమేనని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు ఏమీ కొని తినలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. పట్టణాలలో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై తీవ్రమైన భారాలు మోపారని, ప్రతి ఇంటికీ స్మార్ట్ మీటర్లు బిగింపు పేరుతో ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు. కరెంట్ చార్జీల పెంపు భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తిరుపతి నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయచంద్ర, పి. సాయి లక్ష్మి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, కే వేణుగోపాల్, పి బుజ్జి, ఎం.నరేంద్ర, ఎం జయంతి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి తంజావూరు మురళి, బాదుల్లా షేక్ పాల్గొన్నారు.

**పుత్తూరులో...** అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు. నాయకులు ఆర్.వెంకటేష్, ఎ.విజయ్, సుధాకర్, కృష్ణమూర్తి,రమేష్ పాల్గొన్నారు. **శ్రీకాళహస్తిలో...** సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. గంధం మణి, పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

## పంచాయతీ నిధులు పక్కదారి పట్టిస్తే ఎలా..?

### మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల నిలదీత



**ప్రజాశక్తి -పుత్తూరు టౌన్**

పంచాయతీ నిధులను పక్కదారి పట్టిస్తే పారిశుధ్య కార్మికులకు జీలాలు ఎలా చెల్లించాలి? అని తడుకు సర్పంచి, బొబ్బిలి ఎంపిటిసి శుభ్రత్నమ్మ నిలదీశారు. మంగళవారం ఎంపిపి మునివేలమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సభ్యులు మాట్లాడుతూ నిదులు లేకుండా పారిశుధ్య పనులు ఎలా చేపట్టాలి? అని ప్రశ్నించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఎంపిపి మునివేలమ్మ, ఎంపిడిఒ ఇందిరమ్మ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని, 13 పంచాయతీలకు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీల్లో డ్రైనేజి రోడ్లు నిర్మిస్తామన్నారు. పంచాయతీ ఆదాయం పెంచుకునేందుకు చెరువుల వేలం వేయాలని, రియల్ ఎస్టేట్‌లో ప్లాట్లు వేసిన వారి ద్వారా ఇంటిపన్నులు వేయించి వారి ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. మండల విద్యాశాఖ అధికారి తిరుమల్‌రాజు మాట్లాడుతూ ఐదు నుంచి పదేళ్లలోపు బడి బయట ఉండే పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. సిడిపిఒ పద్మజ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలకు మంచి పౌష్టికాహారం, పాలు, గుడ్లు, నూనె అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు మునస్వామిరెడ్డి, విమలమ్మ, తహశీల్దార్ పరమేశ్వరస్వామి పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాలో తప్పులుంటే కఠిన చర్యలు : కలెక్టర్

**ప్రజాశక్తి -తొట్టంబేడు**

ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే కఠిన చర్యలు తప్పవని తిరుపతి కలెక్టరు కె.వెంకట్రమణారెడ్డి హెచ్చరించారు. తొట్టంబేడు మండలం చిన్నసింగమాల, గురుకులపాళెం గ్రామాల్లో మంగళవారం ఆయన స్వయంగా ఓటర్ల జాబితా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు వెంకట్రమణారెడ్డి మాట్లాడుతూ... మతి చెందిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి వెంటనే తొలగించాలన్నారు. 18ఏళ్లు నిండిన వారిని ఓటర్ల జాబితాలో చేర్చాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే వాటిని సరిదిద్దాలన్నారు. అధికారులు, బీఎల్వోలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సరి చూడాలన్నారు. అర్హులను ఓటర్ల జాబితా నుంచి ఎటువంటి పరిస్థితిలో తొలగించకూడదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషను ఆదేశాల మేరకు తాను స్వయంగా ఓటర్ల జాబితా పరిశీలిస్తున్నట్లు కలెక్టరు ఈ సందర్భంగా చెప్పారు. ఆర్డీవో, తహసీల్దారు కూడా క్షేత్ర స్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలించి పారదర్శకంగా తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీవో కేవస్ రామారావు, తొట్టంబేడు తహసీల్దారు ఎర్రంరెడ్డి సుధీర్ రెడ్డి, ఆర్డీవో కార్యాలయ అధికారి రామమోహన్, వీఆర్వోలు మురళి, మువర్ణ, తహసీల్దారు కార్యాలయ ఉద్యోగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రంలో... నెలబల్లి, అక్కరపాక గ్రామాల్లో ఓటర్ల జాబితాను కలెక్టర్ పరిశీలించారు. నెలబల్లి పోలింగ్ స్టేషన్ 149, అక్కరపాక 171 పోలింగ్ స్టేషన్ లను అయన తనిఖీ చేశారు. ఓటర్ జాబితాలోని మరణాలను, బదిలీలను అదనపు ఓట్లను ఇంటింటికి వెళ్లి అడిగి వివరాలను తెలుసుకున్నారు వీరివెంట సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రముని , తహసీల్దర్ గోపినాథ్ ఉన్నారు



# పండ్లు, కూరగాయ పంటలకు రసాయనాలు వాడొద్దు

**ప్రజాశక్తి - పెళ్లకూరు**

పండ్లు, కూరగాయల సాగులో అధికంగా పురుగు మందులు, ఎరువులు వాడకం ప్రజల ఆరోగ్యానికి మంచిది కాదని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు, కానూరు గ్రామాలలో 'ఆత్మ' సహకారంతో వ్యవసాయ, ఉద్యాన శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రైతుల శిక్షణలో ఆయన మాట్లాడారు. ఈపంటలలో ఎక్కువగా మందులు, ఎరువులు వాడకం వలన ప్రజల ఆరోగ్యం, భూమి ఆరోగ్యం పాడవుతుందని చెప్పారు. కూరగాయ పంటలలో అంతర పంటల సాగు చేసి, పంటల వైవిధ్యం పెంచడం వలన చీడల ఉధతి తగ్గుతుందని తెలిపారు. ఈ పంటలలో జిగురు అట్టలు పెట్టడం, జీవరసాయన మందులు, జీవామతం వంటివి స్ప్రే చేయడం వలన దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. నిమ్మ తోటలకు, వేప పిండి, జీవన ఎరువులు, ట్రైకోడెర్మా, సుడోమోనస్ వంటి జీవ మందులు భూమిలో కలియబెట్టడం వలన, వేరుకుళ్లు తెగులు, ఇతర చీడపీడలు తగ్గుతాయని వివరించారు. నాయుడుపేట డివిజన్ ఉద్యాన అధికారి శారద, వంగ, బెండ, నిమ్మ పంటలలో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు భూసార పరీక్షలు, ఎరువుల వాడకం గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ ఆర్బికేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవల గురించి వివరించి, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులతోపాటు వ్యవసాయ సహాయకురాలు దీపిక పాల్గొన్నారు.



# చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా...!



- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- 'తెలుగుతల్లి' వేషధారణలో విద్యార్థులు

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా..' అంటూ తెలుగు భాషా దినోత్సవ సంబరాలు వేడుకగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించి మంగళవారం బహుమతులను అందజేశారు. జిల్లావ్యాప్తంగా పాఠశాలల్లో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులు 'తెలుగుతల్లి' వేషధారణలో తెలుగుదనం ఉట్టిపడేలా అలరించారు. కొన్నిచోట్ల తెలుగు భాషా ఉత్సవాలతో పాటు క్రీడా ఉత్సవాలను నిర్వహించారు. బైరాగిపట్టెడలోని మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్లో తెలుగుభాషా దినోత్సవం, క్రీడా దినోత్సవం ప్రధానోపాధ్యాయులు ఎ.మురుగన్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు భాషకు చేసిన విశేష కృషిని విపులంగా వివరించారు. సీనియర్ ఉపాధ్యాయిని ఎం.మునిశారద మాట్లాడుతూ మేజర్ ధ్యాన్చంద్ జీవిత విశేషాలను తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వి.మునెమ్మ విద్యార్థులకు క్రీడా దినోత్సవం సందర్భంగా 12వేల విలువైన క్రీడా దుస్తులను వితరణగా అందజేశారు. ఉపాధ్యాయులు రామమూర్తిరెడ్డి, కె.రవికుమార్, వై.హేమాద్రిబాబు, కదిరి రవి, బండి మధుసూదన్‌రెడ్డి, అరుణశ్రీ పాల్గొన్నారు.




**తెలుగు 'లెస్' ప్రకటన**

'తెలుగు భాషా దినోత్సవం' ఒక్కరోజైనా ఆర్భాటంగా జరుపుకుంటున్నారని సంతోషించాలో... సంవత్సరమంతా మరచిపోతున్నారని విచారించాలో అర్థంకాని సందిగ్ధం పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల్లో అంతోఇంతో తెలుగు పలుకులు వినిపిస్తున్నాయి. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో 'తెలుగు' మాటెత్తితే తన్నేలా ఉన్నాయి నిబంధనలు. అంతేకాదు లాంగ్వేజిగానూ తెలుగు తీసుకునే పరిస్థితి లేదు. పదో తరగతి చదువుతున్నా తెలుగులో పూర్తిస్థాయిలో ఓ లెటర్ రాయలేని పరిస్థితి విద్యార్థులది. 'తెలుగుజాతి గొప్పతనాన్ని' ఒకరోజు పండుగగా జరుపుకునే స్థాయికి వెళ్లిపోయాం. అంతేకాదు తెలుగు బాషా దినోత్సవం పురస్కరించుకుని ఎ.రంగంపేట వద్ద శ్రీ విద్యానికేతన్ పాఠశాల వారు 'ఆంగ్లంలో' ముద్రించిన ప్రచార చిత్రమిది. కవులు, పద్యాలు, చిత్రప్రదర్శనలతో పాటు, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు ఉంటాయని ఈ ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ప్రచార చిత్రం ఆంగ్లంలో ఉండటం 'ఔరా' అనిపించింది.

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం**

**చిన్నగొట్టిగల్లులో...** భాకరాపేటలోని సాయిరాం, గీతాంజలి, నారాయణ స్కూళ్లలో కరస్పాండెంట్లు జనార్ధన్‌రెడ్డి, గిరికుమార్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు. **గూడూరు టౌన్‌లో...** విఎస్ఆర్ పాఠశాలలో పిల్లలు రకరకాల కవుల వేషధారణతో పాఠశాలకు వచ్చారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ నందిమండలం బాలకృష్ణంరాజు, కరస్పాండెంట్ అన్నపూర్ణ, ప్రిన్సిపల్ శాంతకుమార్ పాల్గొన్నారు. **రేణిగుంటలో...**తెలుగు భాష ఔనత్యాన్ని చాటిచెప్పిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం ఉపన్యాసకులు బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాలలో అధినేత విక్రంశాలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భావితరాలకు తెలుగు భాష సంపదను అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పాఠశాల డైరెక్టర్ కె.అనూష, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మాధవి, మునిప్రసాద్, మునికుమారి, ఆయేషా, చందు పాల్గొన్నారు.

**పాకాలలో...** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దామలచెరువు ప్రధానోపాధ్యాయులు నాగరాజ మాట్లాడుతూ 'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా.. గతమెంతో ఘనకీర్తి గలవోడా' అనే వేములపల్లి గీతం ఆలపించి విద్యార్థులుఓ్ల చైతన్యం నింపారు. 1966లో తెలుగును రాష్ట్రం అధికారిక భాషగా ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘునాథ్, చంద్రశేఖర్‌నాయుడు, గోవిందయ్య, పార్థసారథి పాల్గొన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఎదురవుతున్న సవాళ్లకు ఎదురు నిలిచి తెలుగును నిలబెట్టుకోవాల్సిన బాధ్యత తెలుగువారందరిపై ఉందని ప్రముఖ కథా రచయిత డాక్టర్ విఆర్ రాసాని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానాచార్యులు డాక్టర్ సురేంద్ర, అధ్యాపకులు మాసిలామని, చిట్టి కళావతి, సురేష్ బాబు పాల్గొన్నారు



**బిఎన్ కండ్రిగలో...** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య ఆధ్వర్యంలో జరిగింది. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, కూడలిలో జానపద నృత్య ప్రదర్శన చేశారు. పిల్లల వేషధారణలు, నృత్యప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శిరోమణి, సుబ్బారావు పాల్గొన్నారు. **కెవిబిపురంలో...** జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఎంఇఒ లక్ష్మిపతి ముఖ్య అతిథిగా పాల్గొని గిడుగు రామమూర్తి జీవిత విశేషాలను వివరించారు. **శ్రీకాళహస్తిలో...** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్ ఆధ్వర్యంలో, కాసాగార్డెన్ బాలికల గురుకులంలో ప్రిన్సిపల్ ప్రభావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. **యర్రావారిపాలెంలో...** ఆదర్శ పాఠవాలలో ప్రిన్సిపల్ బిటి శ్రీదేవి పాల్గొన్నారు. ఎంఇఒ బాలసుబ్రమణ్యం విద్యార్థులకు జ్ఞాపికను అందించారు. **దొరవారిసత్రంలో...** బిసి గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రశేఖర్ సుప్రజ పాల్గొన్నారు. విద్యార్థులకు పోటీలనునిర్వహించి సర్టిఫికెట్లను అందజేశారు. ఏకొల్లు జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సి.నర్సింగరావు ఆధ్వర్యంలో జరిగింది. **పుత్తూరులో...** ఎంపియుపి స్కూల్లో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యం ఆచారి పాల్గొన్నారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయులు చెంచులక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు. కెకెసి కళాశాలలో ఛైర్మన్ కుప్పయ్యశెట్టి ఆధ్వర్యంలో జరిగింది. **తిరుపతి(మంగళం)లో...** తిరుపతి రూరల్ సమీపంలోని రామాపురం నెరిటాన్ సైనిక్ స్కూల్లో జరిగింది. పాఠశాల ఛైర్మన్ శేషారెడ్డి, డైరెక్టర్ సారికా, సందీప్, డీన్ సిజిహెచ్ ఖాన్, ప్రధానోపాధ్యాయిని రూపారాణి పాల్గొన్నారు. మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సి.కేశవులునాయుడు, పీడీ రామకృష్ణ, సాంబశివరావు, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, మునిరత్నం పాల్గొన్నారు. **ఏర్పేడులో..** పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఇఒ ఎం.ఆనందరెడ్డి పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు వై.జయకుమార్‌రెడ్డి, సర్పంచి లలితా కరుణాకర్ పాల్గొన్నారు.

### జీవితకాల సభ్యునిగా ఆర్కాట్ కష్ణప్రసాద్



**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

తెలుగుభాషను అన్ని దేశాలలో ,అన్ని ప్రాంతాల్లో అభివద్ధి చేసేందుకు చెన్నై కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ ప్రపంచ " తెలుగు సమాఖ్య ". జీవిత కాలసభ్యునిగా తిరుపతికి చెందిన సమాజసేవకుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ ను నియమిస్తూ ఆ సంస్థ అధ్యక్షురాలు వి.ఎల్.ఇంద్రదత్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అనే నినాదంతో తెలుగు బాష ప్రస్తుతం విద్యావిధానంలో ప్రాముఖ్యత తగ్గిందని, తెలుగు బాషపై పట్టులేనివారు ఎన్ని ఉన్నత చదువులు అభ్యసించిన వధా అని పేర్కొన్నారు.

**ప్రజాశక్తి-సూళ్లూరుపేట** సూళ్లూరుపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మన్నారు పోలూరులోని ఉన్నత పాఠశాల యందు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినోత్సవం సందర్భంగా తెలుగు భాష వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామెతలు, పొడుపు కథలు, పద్యాలు, వ్యాసరచన, వకత్త్వం, తెలుగు భాషకు సంబంధించిన పాటలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.





## చెంగమ్మకు వైఎస్ఆర్‌బీమా పంపిణీ

**బిఎన్ కండ్రిగ :** మండలంలోని వెస్టవరత్తూర్ గ్రామంలో గురవయ్య అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన భార్య సమ్మిటి చెంగమ్మకు సర్పంచి సుప్రియ దయాకర్ వైఎస్ఆర్ బీమా ద్వారా పదివేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్ శివ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరాములు, మహిళా పోలీసు వాలంటీర్ సుమన్ పాల్గొన్నారు.

## ఎండియు వాహనాల కొరతవల్లే ఆలస్యం

**వెంకటగిరి రూరల్ :** చౌక దుకాణాల డీలర్లతో సిఎస్‌డిటి సంధ్యారాణి మంగళవారం మండల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డీలర్లు వివిధ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సిఎస్‌డిటి స్పందిస్తూ ఎండియు వాహనాలు మండలానికి పూర్తిస్థాయిలో రాకపోవడం వల్ల ఆలస్యం అవుతోందన్నారు. పిడిఎఫ్ బియ్యం, ఐసిడిఎస్ ప్రాజెక్టు పంపిణీ చేసే బియ్యం ఒకే సమయంలో ఇవ్వలేకపోతున్నామని తెలిపారు.

## క్రీడల్లో రాణించాలి : డాక్టర్ జయచంద్ర

**రేణిగుంట :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శ్రీ రామ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర పిలుపునిచ్చారు. కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతి పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ క్రీడలకు సంబంధించి కళాశాలలో అన్ని వనరులు ఉన్నాయన్నారు. ఫిజికల్ డైరెక్టర్ విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

**బిఎన్ కండ్రిగ :** మండలంలోని తలారివెట్టు గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం ఐటిడిఎ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తిరుపతి అమర, శ్రీకాళహస్తి ఎంజిఎం ఆస్పత్రుల ఆధ్వర్యంలో 80 మందికి పైగా వైద్యపరీక్షలు చేశారు. ఐదుగురికి ఆపరేషన్ కోసం రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు దివాకర్, సిహెచ్ఓ వెంకటేష్ పాల్గొన్నారు.

## మంగళంలో ఘనంగా బాల గంగమ్మ జాతర

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పంచాయతీలో గల ఎస్‌బీఎన్ కాలనీలో వెలసిన బాల గంగమ్మ జాతరను స్థానికులు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, టిడిపి చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. స్థానిక ప్రజలు అంబళ్లు పోసి పొంగళ్ళు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

## చేనేతలకు చేసిందేమీ లేదు: చిన్నరెడ్డిబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్నో సంవత్సరాలుగా చేనేత సామాజిక వర్గానికి చెందినవారుగా గుర్తింపు కార్డులను సాధించుకున్న చేనేతలను అధికార పార్టీ కేవలం ఓటర్లుగానే పరిగణిస్తూ గుర్తింపు కార్డులను సైతం రద్దు చేసిందని జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు సుంకర చిన్నరెడ్డిబాబు ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి తన మేనిఫెస్టోలో చేనేతను ఆదుకుంటామని హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక చేనేతలు వారి సమస్యలు ఏకరువు పెట్టుకోవడానికి మంత్రులు ముఖ్యమంత్రుల కార్యాలయాలు చుట్టూ తిరిగేలా చేశారన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

**తిరుపతి టౌన్ :** కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారక నాణెం ఆవిష్కరించడం తెలుగుజాతికి దక్కిన గొప్ప గౌరవమని మాజీ ఎంఎల్ఎ సుగుణమ్మ అన్నారు. మంగళవారం తిరుపతి టౌన్‌క్లబ్ దగ్గర ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్‌సి మునిక్రిష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్‌రాయల్, ఊక విజయకుమార్ పాల్గొన్నారు.

## నెల్లూరుపల్లిలో 104 వైద్య శిబిరం

**దొరవారిసత్రం :** మంగళవారం దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది నెల్లూరుపల్లిలో 104 వాహనం ద్వారా మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి ఔషధాలు అందించారు. అనంతరం నెల్లూరుపల్లి ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, కలకుంట, నెలబల్లి విఆర్ఓ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను వైద్యాధికారి పళనిరాజ్ పర్యవేక్షించారు. భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సంపూర్ణమ్మ సూపర్వైజర్ గోపి కిరణ్, ఎం ఎల్ హెచ్ పి తస్లీమ్, హెల్త్ అసిస్టెంట్ విజయ కుమార్, ఆశా కార్యకర్తలు సుభాషిని, సుదర్శనమ్మ, శ్యామల పాల్గొన్నారు.

## బియ్యపు పవిత్ర రెడ్డిని సన్మానించిన జాన్‌బాబు

ప్రజాశక్తి-రేణిగుంట

ప్రజలందరినీ గంగమ్మ తల్లి చల్లగా చూడాలని వైకాపా మండల ఇన్చార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం రేణిగుంట గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్ నగర్ నందు గంగమ్మ తల్లి జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ గణేష్ నగర్ నందు కొన్ని రోడ్లు కాలువలు ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి త్వరలో ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపిపి సుజాత, తిరుపతి జిల్లా ముస్లిం అధ్యక్షులు రసూల్ పాల్గొన్నారు.



# జగన్ పాలనలో విద్యకు అగ్ర భాగం : మంత్రి మేరుగ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు అగ్ర తాంబూలమిస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. నాడు-నేడుతో సీఎం జగన్ హాస్టళ్లు, పాఠశాలల దిశా దశను మార్చేస్తే, చంద్రబాబు ముఖ్యమంత్రిగా 1866 హాస్టళ్లు మూసి వేశాడంటూ ధ్వజమెత్తారు. మంత్రి నాగార్జున తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని కాసాగార్డెన్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ను స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులకందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. మరుగుదొడ్లు, డార్మెటరీల అవసరం ఉందని విద్యార్థులు మంత్రికి ఫిర్యాదు చేయగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని వివరించారు. నాడు నేడుతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ ధీటుగా తీర్చిదిద్దుతుండగా, అమ్మ ఒడి, విద్యా దీవెన, విదేశీ విద్య లాంటి పథకాలతో పేదల ఇళ్లల్లో చదువుల పువ్వులు పూయిస్తున్నారని కొనియాడారు. ఒకప్పుడు కేరళ రాష్ట్రం చదువుల్లో ముందుండగా, నేడు ఏపీ అగ్రస్థానానికి ఎగబాకుతోందని తెలిపారు.



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు బాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. తెలుగు బాషా ఔన్నత్యాన్ని ఓవైపు కాపాడుకుంటూనే మరోవైపు పేదలు సైతం ఇంగ్లీష్ మీడియం చదవాలన్న ఆశను సీఎం జగన్ నెరవేరుస్తున్నారని కొనియాడారు. త్వరలోనే శ్రీకాళహస్తి ప్రాంతంలో అంబేద్కర్ యూనివర్సిటీని నెలకొల్పుతామని హామీ ఇచ్చారు. ప్రిన్సిపల్ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

**మమ్మల్ని రెగ్యులర్ చేయండి సార్ : కాంట్రాక్టు టీచర్లు**

సాంఘీక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఏపీ రెసిడెన్షియల్ కాంట్రాక్ట్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఆ శాఖా మంత్రి మేరుగ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని కాసాగార్డెన్ బాలికల గురుకులం పర్యటనకు మంగళవారం సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి రాగా కాంట్రాక్టు టీచర్లు ఆయన్ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 793 మంది కాంట్రాక్టు టీచర్లు దాదాపు 16 సంవత్సరాలుగా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తమను సొసైటీ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించారనీ, ప్రస్తుతం దాన్నే సాకుగా చూపి రెగ్యులర్ చేయకుండా మోకాలడ్డడం అన్యాయమని వాపోయారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2002-2006 వరకు కాంట్రాక్టు పరిధిలో పనిచేసిన ఉపాధ్యాయులను రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2014కు ముందు నుండి ఇప్పటివరకు పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామంటూ హామీ ఇచ్చారనీ, ఆ జాబితాలో సాంఘిక సంక్షేమ శాఖా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను చేర్చకపోవడం బాధాకరమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న తెలంగాణ రాష్ట్రంలో గురుకుల సొసైటీ కింద పనిచేస్తున్న కాంట్రాక్టు టీచర్లను అక్కడి సీఎం కేసీఆర్ రెగ్యులర్ చేశారన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సమస్యను సీఎం దష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రితో పాటు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కూడా ఉన్నారు.



# 'సంజీవని' ఆరోగ్య కేంద్రం ప్రారంభం

### ఎన్టీఆర్ ట్రస్టు సేవలు ఎంతో ఆనందం : నారా భువనేశ్వరి

ప్రజాశక్తి - కుప్పం

తన తండ్రి నందమూరి తారకరామారావు ట్రస్టు ద్వారా సేవలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని నారా భువనేశ్వరి అన్నారు. మంగళవారం కుప్పంలో 'సంజీవని' ఆరోగ్య కేంద్రం సంచార వాహనాన్ని ఆమె ప్రారంభించారు. తొలుత తిరుపతి గంగమాంబ దేవాలయానికి చేరుకున్న ఆమె అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారులు సాంప్రదాయ పద్ధతిలో పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతంపలికారు. అనంతరం ప్యాలెస్ రోడ్డులో సంజీవిని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి నందమూరి తారక రామారావు నమ్మిన 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న సూక్తిని నిజం చేస్తూ ఎన్టీఆర్ ట్రస్టు తరపున ప్రజలకు సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే కుప్పం నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందించాలన్న సదుద్దేశ్యంతో సంజీవిని ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా దాదాపు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధులకు ఉచితంగా చికిత్స అందించి, ఔషధాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మొబైల్ క్లినిక్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్దబంగారునత్తం గ్రామ పరిధిలోని ధర్మరాజుల దేవస్థానం ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు నాలుగు వందల మందికి పైగా వైద్య పరీక్షలు అందించారు.

# నిమ్మ, చీని కేంద్రంలో అవినీతి తెగులు

ప్రజాశక్తి - వెంకటగిరి రూరల్

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం పెట్లూరు నిమ్మ, చీని పరిశోధనా స్థానంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై 'ప్రజాశక్తి'లో వారం రోజుల క్రితం ప్రత్యేక కథనం ప్రచురితమయ్యింది. ఈ నేపథ్యంలో టైంస్కేల్ వాచ్‌మెన్ మూడు రోజులు పనిచేసినా ఆబ్సెంట్ వేసినట్లు తెలుస్తోంది. అయితే అధికారులు అవినీతికి పాల్పడుతుంటే చిన్నస్థాయి చిరుద్యోగులపై ప్రతాపం చూపడం విమర్శలకు తావిస్తోంది. నిమ్మకాయలు కోసి రిజిష్టర్లో రాయడం లేదని, దీనివల్ల ప్రభుత్వానికి చూపించాల్సిన బిల్లులు చూపించడం లేదని సమాచారం. గతంలో ఫారంపాండ్ నిర్మాణం చేపట్టేక్రమంలో 300 ట్రిప్పుల మట్టిని కృషి విజ్ఞాన కేంద్రం రైతుల హాస్టల్‌కు ఆ భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌కు అమ్మినా పట్టించుకోలేదని తెలుస్తోంది. జర్నలిస్టు ఫొటోలు తీసినందుకు అక్కస్సుగా ఓ మహిళా కాంట్రాక్టు వర్కర్‌ను అరగంట ఎండలో నిలబెట్టి వేధించినట్లు తెలుస్తోంది. నర్సరీలో నిమ్మమొక్క 52 రూపాయలైతే, రైతులు తయారు చేస్తున్న నర్సరీలో 25 రూపాయలకే లభిస్తున్నాయి. అంతేకాకుండా రైతులు ఇచ్చే మొక్కలు నాణ్యతగా ఉంటున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నిమ్మ, చీనీ కేంద్రంలో అవినీతి ఊడలను పెకలించాల్సి ఉంది.

# నయీమ్ నిరంతర శ్రామికుడు

**గూడూరు :** నీతి, నిజాయితీకి నిలువెత్తు రూపం జన సేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ అని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి అన్నారు. మంగళవారం గూడూరు త్యాగరాజవీధిలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో పవన్ కల్యాణ్ జన్మదిన వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని చిరంజీవి యువత నియోజకవర్గ అధ్యక్షులు సయ్యద్ నయీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ మనకు నష్టం వాటిల్లినా సమాజం బాగుండాలని తపించేవారు చాలా అరుదుగా ఉంటారని, అటువంటి మనస్తత్వం కలిగిన వ్యక్తి పవన్ కల్యాణ్ అన్నారు. రోజుకు రెండు కోట్ల రూపాయలు సంపాదించుకునే అవకాశం ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజల కోసం, బడుగు బలహీన వర్గాల ఉన్నతికి పవన్ కల్యాణ్ శ్రమిస్తున్నారని తెలిపారు. డైమండ్ రాణి ఆర్‌కె రోజా ఉదయం లేచినప్పటినుండి పవన్ కల్యాణ్ ను తిట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా పవన్ కల్యాణ్ అధ్యక్షులు హరినాధ్ రెడ్డి, చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవి కుమార్ పాల్గొన్నారు.

## బాబొస్తే మహిళలకు పెద్దపీట

**గూడూరు / శ్రీకాళహస్తి:** టిడిపి మహాశక్తి ముగింపు కార్యక్రమంలో భాగంగా మహాశక్తి టీమ్ మహిళా నాయకులు, ముఖ్య నాయకులతో కలసి పార్టీ కార్యాలయం నందు ప్రెస్ మీట్ నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ మహాశక్తి కార్యక్రమంలో మహిళలకు టిడిపి ప్రభుత్వం వస్తే ఏమేమి అందిస్తుందో ప్రతి ఒక్కరికి తెలిపేల 30 రోజుల పాటు 40 పంచాయతీల్లో పర్యటించి ప్రచారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండాల లీలావతి, ఘట్టం శ్రావణిరెడ్డి, దువ్వూరు భారతిరెడ్డి పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని మహిళలకు పెద్దపీట వేస్తారని టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష అన్నారు. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 12వ మంగళవారం మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మహానాడులో మహిళలకు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోపై వివరించారు. "మహాశక్తి పథకం" పేరుతో మహిళలకు వరాల జల్లు కురిపించిన చంద్రన్న ధ్యాంక్యూ అంటూ నినాదాలు చేశారు. విజయ్ కుమార్, మిన్నల్ రవి, సుమతి, దుర్గ, ఊహ పాల్గొన్నారు.

## విందూరులో జాతీయ కృత్రిమ గర్భధారణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు మండల పరిధిలోని విందూరు గ్రామంలో రాష్ట్రీయ గోకుల మిషన్ లో భాగంగా జిల్లా పశు వైద్యాధికారి రవి కుమార్ ఆధ్వర్యంలో జాతీయ కత్రిమ గర్భధారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు లేగ దూడలను సంరక్షించుకుని మేలు జాతి పాడి పశువులుగా అభివద్ధి చేసుకోవాలన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ లో భాగంగా జాతీయ కత్రిమ గర్భాదరణ కార్యక్రమం ద్వారా రైతులు మేలు జాతి పశువుల ఉత్పత్తి కోసం లేగ దూడల పెంపకం చేపట్టి తమ ఆదాయ అభివద్ధి తో జీవన ప్రమాణాలు పెంచుకోవచ్చు అన్నారు. అనంతరం రైతులకు లేగ దూడల పోషణలో జాగ్రత్తలు , చూడి పశువుల్లో పోషణ గురించి అవగాహన తెలియచేసారు. అనంతరం మేలు జాతి లక్షణాలు కలిగిన దూడలను ఎంపిక చేసి ప్రథమ , ద్వితీయ , తతీయ బహుమతులు ను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మస్తానయ్యా , ఎంపీటీసీ బొమ్మిరెడ్డి వెంకట రెడ్డి , వైద్యసిబ్బంది సురేష్ , సుదర్శన్ , ప్రభాకర్ , మోహన్ రెడ్డి , ఉషశ్రీ , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరాల్లేని సమాజాన్ని నిర్మించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నేరాల్లేని సమాజాన్ని నిర్మించాలని ఎస్‌పి అన్నారు. తిరుపతి జిల్లాలో ఆగస్టు నెలలో జరిగిన నేరాలపై జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరి అతిథిగృహం సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి తీవ్రమైన/తీవ్రమైన కేసులు, ఎస్సీ ఎస్టీ కేసులు, ప్రయారిటి పీటి కేసుల స్థితిగతులు, కేసులు, మిస్సింగ్ కేసులు, నాన్ బైలబుల్ వారెంట్లు మొదలగు విషయాలపై జిల్లా పోలీస్ అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి తగిన సూచనలు, సలహాలు, మెలకువలను చేశారు. చాప కింద నీరులా అసాంఘిక కార్యక్రలాపాలకు దారి చూపొద్దని, తన దష్టికి వస్తే ఇలాంటి విషయాలపై ఉపేక్షించే ప్రసక్తే లేదు. తప్పు చేసిన వారు ఏ స్థాయి అధికారైన శిక్ష అనుభవించక తప్పదన్నారు. ముఖ్యంగా జూదం, కోళ్ల పందాలు జిల్లా లో ఎక్కడా జరగరాదని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, విమల కుమారి, ముని రామయ్య, ఎస్బి డిఎస్పి గిరిధర పాల్గొన్నారు.

## జనసేన ఆర్థిక సాయం

**గూడూరు రూరల్ :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవల్లో భాగంగా మంగళవారం వైద్య ఖర్చులకోసం జనసేన నాయకులు ఓ యువతికి ఆర్థిక సాయం అందచేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ మాట్లాడుతూ జనసేన కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా చిల్లకూరు మండలం తిక్కవరం గ్రామానికి చెందిన తేజస్విని వైద్యఖర్చుల కోసం శ్రీరామ్ మనోహర్, యస్వంత్ కుమార్ ల సహకారంతో 10 వేలు అందజేశామన్నారు. ఈ నెల 1 న చింతవరంలో జరిగే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు మా బాషా, జనసేన నాయకులు శ్రీనాథ్, అవినాష్,వంశీ, మహేష్, ప్రభాకర్ లు ఉన్నారు.



# మామిడి తోటల్లో బెట్టను అధిగమించాలి

**రేణిగుంట :** మామిడి తోటల్లో బెట్టను అధిగమించడానికి పూస హైడ్రోజల్ ఉత్పత్తి ఉపయోగకరంగా ఉంటుందని రాజ్ కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం రేణిగుంట మండలం కరకంబాడి సమీపంలోని రాస్ కషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో మామిడి తోటల్లో పూస హైడ్రోజెల్ వినియోగం పై శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా కెవికె సినీయర్ శాస్త్రవేత శ్రీనివాసులు మాట్లాడుతూ వర్షాధార మామిడిలో 10 సంవత్సరాలలోపు వయసు వున్న మామిడితోటలలో బెట్టను అధిగమించడానికీ పూస హైడ్రోజెల్ ఉత్పత్తి చాలా ఉపయోగకరంగా ఉంటుందనీ తెలిపారు. న్యూఢిల్లీ ఐఏఆర్ఐ శాస్త్రవేత సుధాకర్ మాట్లాడుతూ చెట్టు పాదుల్లో పూస హైడ్రోజెల్ వేసినట్లైతే ఎక్కువ రోజులపాటు తేమను పట్టి వుంచుకోవటం వలన మొక్కలు పోషకాల సమద్ధిగా తీసుకోని బెట్టను తట్టుకోవటం తోపాటు ఆరోగ్యంగా పెరిగి మంచి పంట దిగుబడినిస్తాయని తెలియజేసారు. ప్రతి చెట్టుకు 125గ్రా చొప్పున వేసుకోవాలని సూచించారు. ఉదయమాణిక్యం, ఎర్రవారిపాలెం మండలం, చిట్టెచెర్ల, చిన్నగొట్టిగల్లు మండలం చెందిన రైతులు పాల్గొన్నారు.

## 'అమృత సరోవర్' పనులు పరిశీలన

ప్రజాశక్తి -ఏర్పేడు

మండలంలోని బండారుపల్లి పంచాయతీ నందు చేపట్టిన అమత సరోవర్ ను కేంద్ర గ్రామీణాభివద్ధి డిప్యూటీ సెక్రటరీ సంజయ్ కుమార్ సందర్శించారు. చాలా బాగుందని సంతోషం వ్యక్తం చేశారు. తామరగుంట పూర్వ చరిత్రను బండారుపల్లి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అమత సరోవర్ పంచాయతీ ప్రతినిధి ఎస్ చెంచు రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న తామరకుంటను ఉపాధి హామీ పథకం ద్వారా అమత సరోవర్ చెరువుగా అభివద్ధి చేసుకొని గ్రామ ప్రజలకు ఒక ఆహ్లాదకరమైన పాండ్ గా ఏర్పడిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సీ.వీ శ్రీనివాస్ ప్రసాద్, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్ధన్ రెడ్డి, పుత్తూరు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టర్ డైరెక్టర్ శ్రీమతి డి.సరిత, ఏ పీ ఓ అవిలాల దేవరి, జేఈ పి.బాలాజీ రావు పాల్గొన్నారు.

## 1న ఎస్‌వి వైద్య కళాశాలలో డాక్టర్ పోస్టులు భర్తీ

**తిరుపతి సిటీ :** ఎస్ వి. మెడికల్ కాలేజీ లో "సీనియర్ రెసిడెంట్", ఎస్.ఎన్.సి. యు. యూనిట్, చిన్నపిల్లల విభాగము వైద్యులు ఖాళీలు భర్తీ చేయడం కొరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విజయవాడ వారి ఆదేశాల మేరకు, అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖరన్ నిర్వహిస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ వి వైద్య కళాశాల నందు సీనియర్ రెసిడెంట్ నియామకానికి సెప్టెంబర్ ఒకటవ తేదీ 10 గంటలు నుండి సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థులకు ఎస్ వి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం నందు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుపబడును. వివరాల కోసం ఎస్వీఎంసీ వెబ్సైట్, 9246991845 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలను అందజేయాలి

**కోట :** మాదిగలకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, సబ్సిడీ రుణాలను అందించాలని ఎస్ ఎమ్ ఆర్ పి ఎస్ తిరుపతి జిల్లా కన్వీనర్ ఆత్మకూరు నాగేంద్ర అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలంలోని శ్యామసుందర పురం గ్రామంలో ఎస్ ఎం ఆర్ పి ఎఫ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నన్నూరు. వెంకటసుబ్బయ్య ఉన్నారు.

## దొంగ ఓట్లపై నిరసన తెలిపితే అరెస్టులా: మధుబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో 40 వేల దొంగ ఓట్లు నమోదు చేశారని, ముఖ్యంగా బలిజ సామాజిక వర్గానికి చెందిన ఓట్లనే తొలగిస్తున్నారని ప్రశ్నించి నిరసన తెలిపితే అరెస్టులు చేస్తారా అని కాపు సంక్షేమ సేన నాయకులు బత్తెన మధుబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇలా దొంగ ఓట్లు నమోదు చేయించుకుని గెలిచి ప్రజలకు ఏమి న్యాయం చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో శ్రీకష్ణదేవరాయల విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి

**తిరుపతి సిటీ :** వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి కొనియాడారు. వేటూరి ప్రభాకరశాస్త్రి 73వ వర్ధంతి సభ తిరుపతిలోని ఎస్వీ ప్రాచ్య కళాశాలలో మంగళవారం ఘనంగా జరిగింది. ముందుగా కళాశాలలోని వేటూరి విగ్రహానికి పుష్పమాలాలంకరణ చేశారు. ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ కవిగా, చరిత్ర పరిశోధకుడిగా, శాసన పరిశోధకుడిగా, ప్రాచీనాంధ్ర సంకలన ప్రచురణకర్తగా, సంస్కత రూపకానువాదకర్తగా ప్రభాకరశాస్త్రి తనదైన ముద్ర వేశారని వివరించారు. విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకుని వద్ధిలోకి రావాలని సూచించారు. అనంతరం స్విమ్స్ వైద్య నిపుణులు డాక్టర్ అల్లాడి మోహన్, విద్యాశాఖాధికారి డా. ఎం.భాస్కర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా. ఆకెళ్ల విభీషణశర్మ, కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.సీతారామశర్మ పాల్గొన్నారు.

## రైతులకు నష్టం వాటిల్లకూడదు : తహశీల్దార్

**బాలాయపల్లి :-** రైతు భరోసా, పిఎం కిసాన్ రైతులు అకౌంట్లో డబ్బులు పడకుండా ఉండకూడదని తాహసిల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల కేంద్రంలో ఉన్న రెవిన్యూ కార్యాల యంలో వ్యవసాయ శాఖ అధికారులతో రైతు భరోసా, పిఎం కిసాన్ సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన ఖాతా నెంబర్లు ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని సరిదిద్ది రైతు భరోసా వచ్చేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలన్నారు. వీఆర్వోలు దీనికి పూర్తిగా సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ శాఖ అధికా రిణి శిరీష , డిప్యూటీ తాసిల్దార్ మస్తాన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పూర్ణ, పాల్గొన్నారు.

## అర్హులకు పథకాలు అందాలి

**పుత్తూరు టౌన్ :** అర్హత కలిగిన ప్రతి లబ్దిదారునికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కెఎల్ఎం రెడ్డి అన్నారు. వార్డు సచివాలయాల పరిశీలనలో భాగంగా లక్ష్మీనగర్, ఎన్జీవో కాలనీలలో తనిఖీ చేశారు.